క్లుప్తంగా

పంచాయతీల అభివృద్ధిపై సమీక్ష



మాట్లాడుతున్న ఎంపీడీఓ కృష్ణమూర్తి

సింహాద్రిపురం : మండల పరిషత్‌ కార్యాలయంలో గురువారం గ్రామ పంచాయతీ అభివృద్ధిపై ఎంపీడీఓ కృష్ణమూర్తి సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. గ్రామాలలోని ప్రజా ప్రతినిధులు గ్రామ సభలలో పాల్గొని ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించే విధంగా సంబంధిత అధికారులతో మాట్లాడాలన్నారు. గ్రామాల అభివృద్ధి కోసం వారు ఇచ్చే సలహాలు, సూచనలు పాటించాలన్నారు. పంచాయతీ తీర్మానం చేసిన తర్వాత గ్రామ స్వరాజ్‌ బోర్డులో అప్లోడ్‌ చేయాలన్నారు. కార్యక్రమంలో మండలస్థాయి విస్తరణ అధికారి పద్మనాభరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

22న అయోధ్య వేడుకలు

చక్రాయపేట : మండలంలోని సురభి గ్రామం నాగలగుట్టపల్లె వద్ద వెలసిన దశరథ మహారాజు ఆలయం వద్ద ఈనెల 22న అయోధ్య వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు దర్మకర్త దశరథ తెలిపారు. నాగలగుట్టపల్లె జడ్పీ హైస్కూల్‌ వద్ద నుంచి ఉదయం 10 గంటలకు దశరథ మహారాజుస్వామి ఆలయం వరకు సీతారాముల ఊరేగింపు ఉంటుందన్నారు. అనంతరం 12 గంటలకు అయోధ్యలో జరిగే శ్రీరాముని విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని ఆలయం వద్ద భక్తులకు ఎల్‌ఈడీ తెరపై లైవ్‌ ప్రదర్శన చేయిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున అన్నదానం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భజన కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఈ వేడుకకు పెద్ద ఎత్తున భక్తులు హాజరు కావాలని ఆయన కోరారు.

అభివృద్ధి పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న వైఎస్‌ మనోహర్‌రెడ్డి, చైర్మన్‌ వరప్రసాదు

పులివెందుల రూరల్‌ : పట్టణంలో జరుగుతున్న మోడల్‌ టౌన్‌ అభివృద్ధి పనులను గురువారం మున్సిపల్‌ ఇన్‌చార్జ్‌ వైఎస్‌ మనోహర్‌రెడ్డి, మున్సిపల్‌ చైర్మన్‌ వరప్రసాదులు పరిశీలించి మాట్లాడారు. పట్టణంలోని సెంట్రల్‌ బోలేవార్డు, పనులు త్వరగా పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. వ్యాపారస్థులకు ఇబ్బందులు లేకుండా పనులు వేగవంతం చేయాలన్నారు. అలాగే పాత మార్కెట్‌లో నూతనంగా నిర్మిస్తున్న కాంప్లెక్స్‌ గదులను పరిశీలించారు. అంకాలమ్మ ఆలయంకు సంబంధించి శిరిబండి వెళ్లే విధంగా నిర్మిస్తున్న రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో కమిషనర్‌ నరసింహారెడ్డి, కాంట్రాక్టర్‌ శేఖర్‌ తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ఖాజామొయినుద్దీన్‌

లింగాల : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ఖాజా మొయినుద్దీన్‌ తనిఖీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న సిబ్బంది సక్రమంగా హాజరు కాక పోవడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే వైద్యురాలు సుభాషిని, ఫార్మసిస్టులు సమయ పాలన పాటించ కుండా పులివెందులలో ఎఫ్‌ఆర్‌ఎస్‌ హాజరు వేసుకుంటున్నారన్నారు. ఇలా జరిగితే వారిపై తగిన చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే శుక్రవారం రామాపురంలో కేంద్ర బృందం తనిఖీ నిర్వహిస్తుందన్నారు. బృందం తనిఖీ చేసే సమయంలో సిబ్బంది తీసుకోవాల్సిన విధి విధానాలపై సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో సీఎచ్‌ఓ శివరాం, సూపర్‌ వైజర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆడుదాం ఆంధ్ర పోటీలు

దువ్వూరు : మండలంలో ఆడుదాం ఆంధ్ర కబడ్డీ పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. గ్రామ స్థాయిలో గెలిచిన జట్లను మండల స్థాయి కబడ్డీ పోటీలు గురువారం దువ్వూరులోని జిల్లా పరిషత్‌ పాఠశాలలో నిర్వహించారు. ఈ పోటీలను ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి ప్రారంభించారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఆడుదాం ఆంధ్ర పోటీలను నిర్వహిస్తోందన్నారు. ప్రతి ఒక్కరూ పోటీల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ శివప్రసాద్‌, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్‌ చిరాకి బాషా, నాయకులు కుంపటి ఖాజీపీర్‌, సిరిపిరెడ్డి నరసింహారెడ్డి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఆదరణ కోల్పోని చెక్కభజనలు

- ఎక్కడ చూసినా దర్శనమిస్తున్న చెక్కభజనలు

పులివెందుల రూరల్‌ : సాంకేతిక పరిజ్ఞానంలో విప్లవాత్మకమైన మార్పులు చోటు చేసుకున్న నేపథ్యంలో ప్రాచీన కాలం నుంచి వస్తున్న చెక్కభజనలు ఆదరణ కోల్పోకుండా వస్తున్నాయి. నేటి కంప్యూటర్‌ యుగంలో కూడా పండుగలు, పర్వదినాలు, తిరుణాలలో, చల్లముద్ద వేడుకలు లాంటి కార్యక్రమాలలో గ్రామీణ ప్రాంతాల్లో ఈ చెక్కభన కార్యక్రమాలు కనిపిస్తూనే వున్నాయి. గజ్జెపూజ వంటి చెక్క భజనలు నేటికీ దర్శనమిస్తున్నాయి. ఎంతో ప్రాచీన కాలం నాటి చెక్కభజన గతంలో ఆదరణ కోల్పోయినా ప్రస్తుత కాలంలో వీటికి పూర్వ వైభవం లభిస్తోంది. గ్రామీణ ప్రాంతంలో చెక్కభజన గురువులను పిలిపించుకుని చెక్కభజన నేర్చుకుంటున్నారు. గజ్జెపూజకు చుట్టూపక్కల బంధుమిత్రులను పిలిపించుకుని గ్రామీణ ప్రాంతాలలో చెక్కభజన కార్యక్రమాన్ని ఎంతో వైభవంగా నిర్వహిస్తారు. పండుగలు, పర్వదినాలు కాకుండా తీరిక దొరికన సమయంలో గ్రామీణ ప్రాంతాలలో చెక్కభజన కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. కళారంగానికి వన్నె తెచ్చిన చెక్కభజన నేటికి గ్రామీణ ప్రాంతాలలో కనిపిస్తుండటంతో చెక్కభజన కళాకారులు ఇప్పటికీ ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా రాష్ట్ర ప్రభుత్వాలు కూడా చెక్క భజన కళాకారులకు తగిన గుర్తింపు ఇవ్వాలని కళాకారులు కోరుతున్నారు.



చెక్కభజన చేస్తున్న కళాకారులు

ప్రోత్సాహక బహుమతులు అందించాలి



ప్రస్తుత కంప్యూటర్‌ కాలంలో కూడా చెక్కభజనలు గ్రామీణ ప్రాంతాలలో ప్రజలను ఆకర్షిస్తున్నాయి. అలాంటి చెక్కభజన కళాకారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన గుర్తింపును ఇచ్చి ప్రోత్సాహక బహుమతులు అందిస్తే ఇంకా ఇష్టంగా చెక్కభజన కార్యక్రమాన్ని చేపడతారు.

– రామచంద్రుడు(చెక్కభజన గురువు), మల్లికార్జునపురం, పులివెందుల

చెక్కభజన కళాకారులను ఆదుకోవాలి



గ్రామీణ ప్రాంతాలలో చెక్కభజ నిర్వహిస్తున్న చెక్కభజన కళాకారులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. చెక్కభజన రంగం, చెక్కభజనపై ఇష్టం ఉన్న కళాకారులు నేటికీ గ్రామీణ ప్రాంతాలలో పర్వదినాలు, పండుగలు, గజ్జెపూజ లాంటి కార్యక్రమాల ద్వారా చెక్కభజన కార్యక్రమాలు అందరిని ఆకట్టుకుంటున్నాయి.

– వెంగముని(చెక్కభజన గురువు), పులివెందుల

రోగులకు వైద్యసేవలు

కొండాపురం : మండలంలోని కొండాపురం, తాళ్లప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రుల్లో గురువారం పంటి రోగులకు వైద్యసేవలు చేసినట్లు కొండాపురం వైద్యురాలు సుజాత తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో ఎన్నడులేని విధంగా రెండు నెలల నుంచి మండలంలోని రెండు ప్రభుత్వ ఆసుపత్రుల్లో పంటి నొప్పులతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేస్తున్నామన్నారు.

ప్రతి గురువారం పంటి సమస్యలు ఉన్నవారి కోసం డెంటిస్ట్‌ సుదర్శన్‌రెడ్డి వస్తున్నారన్నారు. పంటి సమస్యలు ఉన్నవారు ఈ వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

జమ్మలమడుగు : పట్టణంలోని నాగులకట్టలో శుక్రవారం నిర్వహించే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్‌ మూలె సుధీర్‌రెడ్డి పాల్గొంటారని వైఎస్సార్‌సీపీ కార్యాలయ కార్యదర్శి గండికోట గంగాధర్‌ తెలిపారు. శుక్రవారం ఉదయం చౌడేశ్వరిదేవి ఆలయం వద్ద నుంచి ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. సాయంత్రం మూడు గంటలకు టెక్కాయచేనువీధిలో కూడా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి వార్డు కౌన్సిలర్లు, అధికారులందరూ హాజరు కావాలని ఆయన సూచించారు.

అయోధ్య రామయ్య అక్షింతలు పంపిణీ



అక్షింతలను పంపిణీ చేస్తున్న మహిళా భక్తులు

జమ్మలమడుగు : ఈనెల 22న అయోధ్యలో జరిగే రామయ్య విగ్రహ ప్రతిష్ట మహోత్సవం సందర్భంగా పట్టణంలోని కన్నెలూరు నేతాజీ నగర్‌లో అక్షింతలను పంపిణీ చేశారు. గురువారం రాత్రి స్థానిక రామాలయంలోని మహిళా సభ్యులు అక్షింతలు తీసుకుని ఇంటింటికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 22న అయోధ్యలో జరిగే విగ్రహ ప్రతిష్ట మహోత్సవం అనంతరం ఈ అక్షింతలను కుటుంబ సభ్యులు తలపై చల్లుకోవాలన్నారు.

పొదుపు సంఘాల మహిళల ధర్నా



బ్యాంక్‌ గేట్‌ వద్ద బైటాయించిన డ్వాక్రా మహిళలు

లింగాల : స్థానిక ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్‌ వద్ద గురువారం పొదుపు సంఘాల మహిళలు ధర్నా నిర్వహించారు. డ్వాక్రా సంఘాలకు వెంటనే రుణాలు అందించాలని గత శుక్రవారం ధర్నా నిర్వహించిన విషయం విధితమే. అప్పట్లో రీజనల్‌ మేనేజర్‌ 19న లింగాలకు వచ్చి డ్వాక్రా మహిళలతో చర్చిస్తామని మేనేజర్‌, పోలీసులు హామీచ్చారు. అయితే ఆయన లింగాలకు రాక పోవడంతో తిరిగి 19న డ్వాక్రా మహిళలు బ్యాంక్‌ గేటు వద్ద బైటాయించి లావా దేవీలను ఆపేశారు. దీంతో చీఫ్‌ మేనేజర్‌ గుణప్రసాదు, సీనియర్‌ మేనేజర్‌ చిరంజీవి గురువారం సాయంత్రం బ్యాంక్‌కు చేరుకుని డ్వాక్రా మహిళలతో చర్చించారు. రెండు మూడు రోజులలో 9 సంఘాలకు రుణాలు అందిస్తామని మిగిలిన 20 సంఘాలకు తర్వాత రుణాలు అందిస్తామని హామీ ఇవ్వడంతో మహిళలు శాంతించి ధర్నా విరమించారు. కార్యక్రమంలో బ్యాంక్‌ మేనేజర్‌, జ్ఞానమూర్తి, సీఐ బాలమద్దిలేటి, ఎస్‌ఐ రవికుమార్‌, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న సురభి నాటకాలు



సురభి నాటకంలో ప్రదర్శన

పులివెందుల రూరల్‌ : చక్రాయపేట మండలంలోని సురభి గ్రామంలో పుట్టిన ఈ సురభి నాటకాలు దేశ వ్యాప్తంగా ఎంతో ప్రాచుర్యం పొందుతున్నాయి. సంక్రాంతి పండు సందర్భంగా పులివెందులలోని గరండాల్‌ రివర్‌ ఫ్రంట్‌ (రాణితోపు)లో గురువారం 6వ రోజు శ్రీనివాసుని కల్యాణం నాటక ప్రదర్శనను కళ్లకు కట్టినట్లుగా ప్రదర్శించారు. ఆరు రోజుల పాటు సురభి నాటకాలను నిర్వహించారు.

ఘనంగా యోగివేమన జయంతి వేడుకలు



యోగివేమారెడ్డి జయంతి సందర్భంగా అన్నదాన సత్రం దగ్గర రెడ్డి సోదరులు

బ్రహ్మంగారిమఠం : ప్రముఖ పుణ్యక్షేత్రం మండల కేంద్రమైన బ్రహ్మంగారిమఠంలో ఉన్న యోగివేమారెడ్డి రెడ్ల అన్నదాన సత్రంలో గురువారం యోగివేమారెడ్డి జయంతి వేడుకలను నిర్వాకులు ఘనంగా జరుపుకున్నారు. జయంతి సందర్భంగా బ్రహ్మం భక్తులకు ప్రత్యేక అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెడ్ల అన్నదాన సత్రం గౌరవ అధ్యక్షుడు చిన్న ఓబుల్‌రెడ్డి, అధ్యక్షుడు గంగిరెడ్డి, ఉపాధ్యక్షుడు భోగిరెడ్డి శశికాంత్‌రెడ్డి, గురివిరెడ్డి, ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, పట్టాబిరెడ్డి, చెన్నకృష్ణారెడ్డి. సిద్దారెడ్డి, సుబ్బారెడ్డి, కృష్ణారెడ్డి, కమిటి సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్‌

చెన్నూరు : 2024–2025 ఆర్థిక సంవత్సరానికిగాను గ్రామాల అభివృద్ధిపై పక్కాగా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం శర్మ, ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్‌లు తెలిపారు. గురువారం స్థానిక మండల పరిషత్‌ సభా భవనంలో ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ అధ్యక్షతన అధికారులు, ప్రజా ప్రతినిధులకు మండలస్థాయి గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చీర్ల సురేష్‌యాదవ్‌ మాట్లాడుతూ మండల అధికారులు, సచివాలయ సిబ్బంది సమన్వయంగా గ్రామాలలో ఏయే సమస్యలు ఉన్నాయో వాటన్నింటినీ గుర్తించి సంబంధించిన ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. అలాగే అధికారులు చెప్పినవి తప్పక పాటిస్తూ వాటన్నింటిని పరిగణలోకి తీసుకుని గ్రామస్థాయి నుంచి మండలస్థాయి వరకు అన్ని సమస్యలపైన, అన్ని పనులపైన ప్రణాళికలు సిద్ధం చేయాలని వారు తెలియజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 సునీత, ఈఓపీఆర్డీ సురేష్‌ బాబు, ఏపీఎం గంగాధర్‌, అంగన్వాడీ సూపర్వైజర్లు గురమ్మ, నాగరత్నమ్మ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు బి.మఠంలో దళితుల ర్యాలీ

బ్రహ్మంగారిమఠం : విజయవాడలో శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి బీఆర్‌ అంబేద్కర్‌ భారీ విగ్రహ ఆవిష్కరణ ప్రారంభ నేపథ్యంలో మండల కేంద్రమైన బ్రహ్మంగారిమఠం లో ఎమ్మెల్యే ఎస్‌.రఘురామిరెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని దళితులు భారీ సంఖ్యలో ర్యాలీ నిర్వహించనున్నట్లు ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి జెడ్పీటీసీ ఎం.రామగోవిందరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం సాయంత్రం 3గంటలకు మఠం నాల్గురోడ్లు కూడలి నుంచి భారీ ర్యాలీ సాగుతుందన్నారు.

పోలీస్‌ స్టేషన్‌ దగ్గర ఉన్న అంబేద్కర్‌ విగ్రహానికి పూలమాలవేసి అక్కడనుంచి ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో బహిరంగ సభ అనంతరం 5గంటలనుంచి విజయవాడలో ముఖ్యమంత్రి ప్రసంగం ను ప్రత్యక్షంగా దళితులు తిలకిస్తారని పేర్కొన్నారు.

పరామర్శ



మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

జమ్మలమడుగు : న్యాయవాది, ఏపీ బాలికల హక్కుల కమిషన్‌ సభ్యురాలు లక్ష్మీదేవి అనారోగ్యం కారణంగా బుధవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్‌ మూలె సుధీర్‌రెడ్డి ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే ఆమె మృతిపై పలువురు నాయకులు సంతాపం ప్రకటించారు. గురువారం అంత్యక్రియలను నిర్వహించారు. బాలికల హక్కుల కమిషన్‌ సభ్యులు రాజేంద్రప్రసాద్‌, పద్మావతిలు నివాళులు అర్పించారు.

నివాళి

చింతకొమ్మదిన్నె : మండలంలోని మద్దిమడుగు బిడికి గ్రామానికి చెందిన వైఎస్‌ఆర్‌ సీపీ నాయకుడు గంగిరెడ్డి గురువారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి మృతుడి ఇంటి వద్దకు చేరుకుని మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్‌ గుడా ప్రభాకర్‌రెడ్డి, కో కన్వీనర్‌ కళాయాదవ్‌, సర్పంచ్‌ మల్లికార్జున యాదవ్‌, వైఎస్సార్‌ సీపీ నాయకులు నివాళులర్పించారు.

రసవత్తరంగా ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు

పులివెందుల రూరల్‌ : పట్టణంలోని జెఎన్‌టీయూ కళాశాలలో ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు రసవత్తరంగా జరుగుతున్నాయి. ఈనెల 11 నుంచి ప్రారంభమైన ఈ పోటీలలో భాగంగా గురువారం జెఎన్‌టీయూ కళాశాలలో క్రికెట్‌ పోటీలు నిర్వహించారు. మండలస్థాయిలో క్రికెట్‌ పోటీలకు 18 టీములు పాల్గొన్నాయి. ఇందులో ఫైనల్‌కు చిన్నరంగాపురం, సియోన్‌పురం టీములు చేరుకున్నాయి. ఈనెల 20వ తేదీన ఫైనల్‌ మ్యాచ్‌ నిర్వహిస్తామన్నారు. ఆడుదాం ఆంధ్రా క్రికెట్‌ పోటీలను గురువారం మున్సిపల్‌ చైర్మన్‌ వరప్రసాదు, కమిషనర్‌ నరసింహారెడ్డి, సివిల్‌ సప్లై డైరెక్టర్‌ గంగాధర్‌రెడ్డిలు పరిశీలించారు. కార్యక్రమంలో కౌన్సిలర్‌ కిషోర్‌, కోడి రమణ, డేనియల్‌, చంద్రమౌళి, నాగరాజు, సంపత్‌ పాల్గొన్నారు.

విద్యుత్‌ పరికరాల పపహరణపై ఫిర్యాదు

కొండాపురం : ఇటీవల వరుసగా పంట పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్లను రాత్రి వేళ పగలగొట్టి అందులోని కాపర్‌ వైర్‌ను అపహరిస్తున్న సంఘటనలపై గురువారం తాళ్లప్రొద్దుటూరు పోలీస్‌స్టేషన్‌లో మండల విద్యుత్‌ శాఖ ఏఈ ఎం.ఓబులేసు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశామని ఎస్‌ఐ చంద్రశేఖర్‌ తెలిపారు.

కూరగాయలు, మటన్‌ మార్కెట్లకు వేలం పాట



వేలం పాటలో మాట్లాడుతున్న వైఎస్‌ మనోహర్‌రెడ్డి

పులివెందుల రూరల్‌ : స్థానిక మున్సిపల్‌ కార్యాలయంలో గురువారం కూరగాయల మార్కెట్‌, మటన్‌ మార్కెట్లకు సంబంధించి వేలం పాటను మున్సిపల్‌ ఇన్‌చార్జ్‌ వైఎస్‌ మనోహర్‌రెడ్డి, మున్సిపల్‌ చైర్మన్‌ వరప్రసాదుల ఆధ్వర్యంలో నిర్వహించారు. వేలం పాటలో వివిధ వ్యాపారస్థులు పాల్గొన్నారు. కురగాయాల మార్కెట్‌ను మహదేవరెడ్డి రూ.43 లక్షల 5 వేలకు దక్కించుకున్నారు. అలాగే మటన్‌ మార్కెట్‌ను చెన్నకేశవనాయుడు రూ.3 లక్షల 56 వేలకు దక్కించుకున్నారు. వేలం పాటలో కురగాయల మార్కెట్‌, మటన్‌ మార్కెట్‌ దక్కించుకున్న వారు మున్సిపల్‌ గెజిట్‌ ప్రకారం పన్నులు వసూలు చేయాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్‌ నరసింహారెడ్డి, మున్సిపల్‌ అధికారులు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ దివిజ

వేంపల్లె : మండలంలోని గ్రామ పంచాయతీలు అభివృద్ధి చెందాలంటే డ్రైనేజీ పారిశుద్ధ్యం, తాగునీరు తదితర వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ దివిజ సంపతి తెలిపారు. గురువారం మండల సభాభవనంలో నిర్వహించిన మండలస్థాయి సమావేశంలో ఆమె మాట్లాడుతూ గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం ప్రణాళికలు రూపొందించాలన్నారు. ముఖ్యంగా రాబోవు వేసవి కాలం దృష్టిలో పెట్టుకుని తాగునీటి సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. అలాగే డ్రైనేజీ, వీధిలైట్లు, సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా చూడాలన్నారు. అవసరమైన ప్రాంతాలలో గ్రావెల్‌ రోడ్డు తదితర వాటిపై దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో వేంపల్లె జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, ఈఓఆర్డీ మల్లికార్జునరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

పేద ప్రజల కోసమే వికసిత్‌ భారత్‌ సంకల్ప యాత్ర



వికసిత్‌ భారత్‌ సంకల్పయాత్రలో అధికారులు

ఎర్రగుంట్ల : కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా పేద ప్రజలకు అనేక సంక్షేమ పథకాలను అందజేస్తోందని వీటిపై గ్రామీణ స్థాయిలో అందరికి అవగాహన కలిగించుటకు వికసిత్‌ భారత్‌ సంకల్పయాత్రను చేపట్టిందని ఎంపీడీఓ భాగ్యలక్ష్మి తెలిపారు. గురువారం ఈ యాత్ర కలమల్ల, సున్నపురాళ్లపల్లి గ్రామాలలో పర్యటించిందన్నారు. కార్యక్రమంలో కలమల్ల సర్పంచ్‌ మేరి, సున్నపురాళ్లపల్లె సర్పంచ్‌ వరలక్ష్మీ, చిలంకూరు పీహెచ్‌సీ డాక్టర్‌ సాయిచరిత, గణేష్‌కుమార్‌రెడ్డి, ఏపీఎం జగదీశ్వరి, చిలంకూరు ఏపీజీబీ బ్యాంకు మేనేజర్‌ సునీల్‌కుమార్‌, మండల వ్యవసాయ అధికారి శ్రీకాంత్‌రెడ్డి, ఏపీఓ గంగాదేవి, అయూష్‌ డాక్టర్‌ పరిమళ, హౌసింగ్‌ ఏఈ రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ, వలంటీర్లు, అన్ని శాఖ అధికారు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా అజ్మీర్‌ షరీఫ్‌ ఉరుసు మహోత్సవం



జెండాలను ఊరేగింపుగా తీసుకువస్తున్న పీఠాధిపతి

జమ్మలమడుగు : అజ్మీర్‌ షరీఫ్‌ ఖాజా గరీబున్‌ నవాజ్‌ ఉరుసు మహోత్సవంను గురువారం వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని పలగాడి వీధిలో ఉన్న ఆస్థానయే గౌసియా పీఠాధిపతి సయ్యద్‌ షా గౌస్‌పీరాఖాద్రీ ఆధ్వర్యంలో జెండా పండుగను నిర్వహించారు. ఈ సందర్భంగా పక్కీర్‌లతో మేళా నిర్వహించారు. అనంతరం పీఠాధిపతి సయ్యద్‌ షా గౌస్‌పీరా ఖాద్రీ మాట్లాడుతూ అజ్మీర్‌ షరీఫ్‌ తమ మహిమల ద్వారా ఎంతో మందిని శిష్యులుగా తయారు చేసుకోవడంతోపాటు, ఇస్లాం బోధనలు ప్రజలకు వివరించి ప్రజలను సరైన దారిలో పెట్టే ప్రయత్నం చేశారన్నారు. ప్రతి వ్యక్తి సన్మార్గంలో నడవడం ద్వారా నిజాయతీ ధైర్యాన్ని ఇస్తుందన్నారు. సయ్యద్‌షా తాహీర్‌పీరాఖాద్రీ పాల్గొన్నారు.

మార్మోగిన రామనామం



కడప నగరంలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్న రామభక్తులు



ఊరేగింపుగా తీసుకువస్తున్న రాముడి విగ్రహం

కడప కల్చరల్‌ : అయోధ్యలో శ్రీరామ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా ప్రతి జిల్లాలో ప్రచార ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా గురువారం కడప నగరానికి హైదరాబాదు నుంచి శ్రీరామ భక్తుల ఆధ్వర్యంలో భారీ శ్రీరాముని విగ్రహాన్ని తీసుకొచ్చారు. నగర శివార్లలోని శ్రీ విజయదుర్గాదేవి ఆలయం వద్ద స్థానిక భక్తులు అయోధ్య తీర్థ క్షేత్ర ట్రస్టు స్థానిక ప్రతినిధులు ప్రచార కార్యక్రమాల ఐక్యవేదికతోపాటు హౌసింగ్‌ బోర్డు శ్రీకోదండ రామాలయ భక్తబృందాలు ఘనంగా స్వాగతం పలికి పూజలు నిర్వహించారు. శిరస్సుకు వస్త్రం చుట్టి ఉన్న శ్రీరాముని భారీ విగ్రహాన్ని ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన వాహనంపై నగర వీధుల్లో భారీగా ఊరేగించారు. ఈ సందర్భంగా శ్రీరామ భక్తులు జై శ్రీరామ్‌ నినాదాలతో నగరంలో 21వ తేదీన జరగనున్న శ్రీరామ శోభాయాత్రకు సంబంధించిన కరపత్రాలను అందజేశారు. దాదాపు రెండు వేల మందికి పైగా భక్తులు పాల్గొన్న ఈ ర్యాలీ అల్మాస్‌పేట సర్కిల్‌, చిలకలబావి, చెన్నూరు బస్టాండు, వన్‌టౌన్‌ సర్కిల్‌, కృష్ణాసర్కిల్‌, శంకరాపురం మీదుగా చిన్నచౌకులోని శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయానికి చేర్చారు. ఈనెల 21వ తేదీన ప్రత్యేకంగా అలంకరించిన రథంలో ఈ విగ్రహాన్ని కొలువుదీర్చనున్నారు. ఈ కార్యక్రమంలో కడప నగరానికి చెందిన పలు ధార్మిక సంస్థలు, దేవాలయాల ప్రతినిధులు, వీహెచ్‌పీ, ఆర్‌ఎస్‌ఎస్‌ కార్యకర్తలు, శ్రీరామ భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.